# 3

# దేవుని బిడ్డలు

(రచనా కాలం 1980)

"బయటికి నడు వెధవా! ఎన్ని రోజుల్రా వెళ్లేది?... పదిహేను రోజులా? మీ ఇంటి వద్దే ఉండు. నీ జీతం నెలనెలా మనియార్డరు చేస్తా! ఫో! మళ్లీ నా కళ్ల ముందు కనబడకు. అసలు నాకు యింట్లో పనిమనిషే అవసరం లేదు. తిండి దండగ."

"ఆ బోడి గుండు చూడు వెధవలాగ. నీ ఏడ్పు నాకేం కొత్తా! నడు నడు. ఈ ఇంట్లోంచి బయటికి నడు. ఇంకెక్కడైనా పని చూసుకో ఫో!" అంటూ బయటికి నెట్టివేసింది లత.

రాయిలా నిలబడి వలవలా కన్నీరు కారుతోంటే నేలకు ముఖం వేసికొని తనలోతానే కుమిలిపోయాడు కిష్టయ్య.

ఇక ఆ రోజుతో ఆ యింటికీ తనకూ రుణం తీరిపోయిందనుకున్నాడు.

మేడ మెట్లెక్కి కిష్టయ్య బట్టల మూటని తెచ్చి కిష్టయ్య ముందు పారేసింది లత.

లక్ష్మి స్నానం చేస్తోంది. అమ్మ గొంతు వినబడుతోంది గాని విషయం ఏమిటో అస్పష్టంగా ఉంది.

పుట్టెడు దుఃఖం కడుపులో దాచుకొని మింగ లేక కక్కలేక వెక్కివెక్కి ఏడుస్తూ తన బట్టలమూట పట్టుకుని భారంగా ఒక్కొక్క అడుగేస్తూ బయటికి వెళ్ళిపోయాడు కిష్టయ్య.

శేఖర్, లత వాళ్ళాయన ఉదయమే గుడికి వెళ్ళి అటునుండి అటే డ్యూటీకి వెళ్లినట్టున్నాడు.

ఇంటర్ చదువుతున్న శ్రీధర్ ట్యూషన్‌కు వెళ్లినట్టున్నాడు.

ఇంట్లో యితరుల అలికిడేమీ లేదు.

లక్ష్మి కన్పిస్తుందేమోనని దూరం నుంచి కొంతసేపు ఆశగా చూశాడు. కిష్టయ్య.

స్నానం చేసి వచ్చేసరికి అమ్మ కిష్టయ్యని వెళ్లగొట్టిందని తెల్సి లోలోపలే విలపించింది లక్ష్మి.

ఏమీ చేయలేని అసహాయ స్థితిలో నిస్పృహతో భారంగా వెళ్లి ఒక చెట్టు మొదట్లో కూలబడ్డాడు. కిష్టయ్య జరిగిన సంగతులన్ని కళ్ళల్లో కదలాడాయి. వేదనతో కళ్ళు మూసుకున్నాడు.

లక్ష్మి కిష్టయ్యతో కల్సి నేర్చుకొన్న కథలెన్నో మనస్సును కలిచివేశాయి.

❄ ❄ ❄

కిష్టయ్యతో లక్ష్మికి స్నేహం గమ్మత్తుగా మొదలయింది.

ఆరోజు రెండో అంతస్థు నుంచి ఏదో ఆలోచిస్తూ వడివడిగా మెట్లు దిగుతోంది. లక్ష్మి. మెట్లు దిగుతోంటే గులాబీ రంగు గౌనులో చాలా అందంగా కన్పిస్తోంది. బేబీ కటింగ్ వెంట్రుకలు, వేగానికీ, గాలికీ అటూ, ఇటూ అందంగా రెపరెపలాడు తున్నాయి.

నెత్తి మీద నీళ్ల బిందెతో మెట్లెక్కుతున్న కిష్టయ్యకు వడివడిగా మెట్లు దిగుతున్న లక్ష్మి తాకడం, బిందె జారిపోయి మెట్ల మీదనుండి ఖన్, ఖన్‌మంటూ దొర్లుకుంటూ కింద పడిపోవడం క్షణాల్లో జరిగిపోయాయి.

భయంతో బిగుసుకు పోయాడు కిష్టయ్య.

లత గబగబా దిగివచ్చి, "బిందె పగులగొట్టావా వెధవా! పై నుంచి ఎవరొస్తున్నది కళ్ళు కనబడ్డంలేదా?" అని చీవాట్లేస్తూ నాలుగంటించింది.

పొరపాటు తనదేనని లక్ష్మి చెప్పబోతే నోరు విప్పకుండా చేసింది లత.

కిష్టయ్య ఏడుస్తున్నాడు.

తన అజాగ్రత్త వల్లే కిష్టయ్య దెబ్బలు, చీవాట్లు తినాల్సి వచ్చిందని విలవిల్లాడింది లక్ష్మి.

"కిష్టయ్యా! ఏడవకు! తప్పునాదే. అమ్మ నిన్ను కొట్టింది." అని ఓదార్చింది లక్ష్మి.

ఆ ఓదార్పుతో కిష్టయ్యకు మరింత దుఃఖం పొంగి వచ్చి భోరున ఏడ్చాడు.

కొంత సేపటిదాకా కిష్టయ్య వద్దే ఉంది లక్ష్మి.

ఆరోజు నుంచి కిష్టయ్యంటే ఎంతో అభిమానం, సానుభూతి చూపేది లక్ష్మి.

తన స్నేహితులతో లాగే స్నేహం చేసేది.

తనకు పెట్టిందాంట్లోంచి అమ్మకి తెలియకుండా కిష్టయ్యకి పెట్టేది. అలా లక్ష్మికీ, కిష్టయ్యకు స్నేహం కుదిరింది.

కిష్టయ్య, లక్ష్మి దాదాపు సమ వయస్కులే.

లక్ష్మి నాన్న శేఖర్ ఇంజనీరు.

లక్ష్మి ఏదో ప్రయిమరీ స్కూల్లో చదువుతోంది.

కిష్టయ్యకు లక్ష్మి ఇంట్లో నెలకు కొంత జీతం యిచ్చి తిండి వాళ్లే పెడతారు. తిండి అంటే వేడిఅన్నం, తాజాకూరలు కాదు. పాసిపోయిన అన్నం, పాడయిపోయిన కూరలు పెడుతుంది లత.

పనేమో పొద్దస్తమానం చెప్తుంది.

కిష్టయ్య సొంతూరు ఆ పట్టణానికి ఆరేడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

కిష్టయ్య రెండు మూడు రోజులకోమారైనా వాళ్ల పల్లెకు వెళ్లి వస్తుంటాడు. సాయంత్రం పనంతా అయ్యాక వెళ్లి ఉదయం మళ్లీ పనికి అందివస్తుంటాడు.

ఇంటికెళ్లిన కిష్టయ్య ఒకోసారి, రెండ్రోజులు అంటే ఉండేవాడు. ఆ మరుసటి రోజు వచ్చాక కేకలేసేది లత.

లక్ష్మికి కిష్టయ్య లేని రోజు ఏదో వెలితిగా ఉండేది.

కిష్టయ్య పల్లెకు వెళ్లి మళ్లీ వచ్చిన రోజున లక్ష్మి పల్లె విశేషాలు తెలుసుకొని ఆ లోటు భర్తీ చేసుకొనేది.

కిష్టయ్యకు ఇద్దరన్నయ్యలు, ఒక చిట్టి చెల్లాయి ఉన్నారు.

కిష్టయ్య నాన్నా, అన్నయ్యలు రైతుల వద్ద పాలేర్లుగా కొలువున్నారు.

ఎప్పుడూ బాకీలు. ఎప్పుడూ కష్టాలే. అంతా విని అయ్యో పాపం అంటుంది లక్ష్మి. ఆ మాటతో కష్టాలన్నీ మాయమయినంత ఆనందం కిష్టయ్యకి. అలా వారి స్నేహం ఒకరు చెప్పడం ఒకరు వినడం నుంచి మంచి స్నేహితులుగా మారిపోయారు. అయితే ఇదంతా వాళ్ళమ్మకు తెలియకుండానే జరిగేది. అప్పుడప్పుడూ మీ వూళ్ళోవాళ్ళు ఇలా చేస్తే బావుండేది కదా అని అడిగేది లక్ష్మి.

❄ ❄ ❄

"మొన్న ఓసారి నువ్వన్నట్టు మా వోల్లంతా సెలవులు కావాలని, జీతాలు పెంచాలని, పని గంటలు రోజుకు ఎనిమిది గంటలే వుండాల్నని, మంచె కావలి కాసెటోల్లకు ఒక టార్చిలైటు, గొంగడి, చెప్పులు ఇవ్వాలని, దసరకు, ఉగాదికి కొత్త బట్టలు పెట్టాల్నని అడిగిన్రు" అని చెప్పాడు ఒకసారి కిష్టయ్య.

"మరైతే అన్నీ ఇచ్చేసిన్రా" అని అడిగింది లక్ష్మి. అడిగినవన్నీ అమ్మా నాన్న వద్ద దొరికినట్టే దొరుకుతాయనుకుంది లక్ష్మి.

"ఇంకా ఎటూ తేలలేదు. పని బందు వెట్టిండ్రు" అన్నాడు కిష్టయ్య.

"ఇన్ని రోజులు ఎందుకు? అప్పుడే సరే అనొచ్చుగా" అంది లక్ష్మి ఉత్సాహం అంతా నీరుకారిపోతుంటే.

"వాళ్లు దొరలు, రైతులు. గట్ల ఎట్లిస్తరు. ఊరోల్లు ఇస్తననుకున్నా పెద్దొర వద్దన్నడు. ఇచ్చినకొద్ది ఇంకెక్కువ అడుగుతరు" అని బెదిరించిండు. మిగతా రైతులకు దొరంటే భయం" అన్నాడు కిష్టయ్య.

"దొరంటే ఎవరు" అంది లక్ష్మి.

"పెద్దొర అంటే మా వూల్లే అందరికన్నా ఎక్కువ భూములు ఉన్నయి. అందరికంటే పెద్ద బంగుల ఉంది. అందరికీ తాకులాటలు పెడుతడు. సర్పంచ్, పోలీసు పటేల్, పటువారి, పెద్దొర చెప్పినట్టే వింటరు. పెద్దొర మా వూరికి రాజు. మా వూరికి ఎంత పెద్దలొచ్చినా ముందుగాల పెద్దొరనే గలవాలె. పెద్దొరకు రెండు ట్రాక్టర్లున్నయి. పెద్దొర బంగ్లాను అందరూ గడి అని పిలుస్తరు. పెద్దొరకు పెద్ద తుపాకి ఉంది" అని పూసగుచ్చినట్టు చెప్పాడు కిష్టయ్య.

"చిట్టీ అమ్మ భోజనానికి రమ్మంటుంది" లక్ష్మి అన్నయ్య శ్రీధర్ చెప్పడంతో ఇంట్లోకి వెళ్ళింది లక్ష్మి.

శ్రీధర్ ఇంటర్ చదువుతున్నాడు. అతడు ఎప్పుడూ బిజీయే. ఎటెటో తిరుగుతుంటాడు.

❄ ❄ ❄

తిండి తిప్పలు లేక చెట్టుకింద ఒరిగిన కిష్టయ్య కళ్లు తెరిచాడు. సాయంత్రం అయింది. తన బట్టల మూట పట్టుకుని లేచాడు.

స్కూలు విడిచింతర్వాత ఇంటికి వెళ్లేపుడు తోవలోనైనా లక్ష్మిని కలుద్దామని లక్ష్మి రోజూ వెళ్లే బాటవేపు మెల్లమెల్లగా నడిచాడు కిష్టయ్య.

బస్సులు, కార్లు, జీపులూ రోడ్డుమీద వేగంగా పరిగెడుతున్నాయి. ఒకోసారి అవతలివేపు ఎవరు నడుస్తున్నది కన్పించడం లేదు.

అవతల తోవలో తనకు కన్పించకుండా లక్ష్మి వెళ్లిపోదు గదా అని తీవ్రంగా భయపడిపోతున్నాడు.

లక్ష్మి కన్పించింది. లక్ష్మి పక్కన సుజాత, గీత ఉన్నారు. వాళ్లు ఏదో మాట్లాడిస్తున్నారు. లక్ష్మి ఏమ్మాట్లాడకుండా తల వాల్చి నడుస్తోంది.

వడివడిగా అడుగులు వేశాడు కిష్టయ్య.

ఒక్కసారిగా లక్ష్మి అని కేక వేశాడు.

లక్ష్మి అదిరిపడింది.

కిష్టయ్యా అంటూ కేక వేసింది.

లక్ష్మిని పేరుపెట్టి పిలవడం కిష్టయ్యకు అదే మొదటిసారి.

సుజాత, గీత లక్ష్మిని విడిచి ముందుకు సాగనూ లేక, గుండుతో మురికి బట్టలతో నల్లగా, వికారంగా ఉన్న కిష్టయ్యతో లక్ష్మి ఆ రోడ్డు మీద మాట్లాడడం సహించ లేక అసహనంగా అటూ ఇటూ చూశారు.

తను పార్కులో కొంతసేపు ఉండి వస్తానని వాళ్లని వెళ్లమని చెప్పింది లక్ష్మి. గీతా, సుజాత వెళ్లిపోయారు.

కిష్టయ్యా, లక్ష్మి పార్కుకేసి నడిచారు.

వీపుమీద పుస్తకాల బ్యాగ్‌ను తీసి కింద పారేస్తూ కూర్చుంది లక్ష్మి.

బట్టలు మూటను తన పక్కనే పెట్టుకు కూర్చున్నాడు కిష్టయ్య.

కుశలమడిగింది లక్ష్మి.

భోరున ఏడ్చాడు కిష్టయ్య.

కొంతసేపటికి తేరుకుని ఆ పదిహేను రోజుల్లో జరిగిన సంఘటనలు ఒక్కోటి వివరించాడు కిష్టయ్య.

దుఃఖంతో గంభీరంగా ఉన్న కిష్టయ్యని చూస్తూ వింటోంది లక్ష్మి.

❄ ❄ ❄

పాలేర్ల సమ్మె నాలుగు రోజులు బాగా జరిగింది.

పొలాలు ఎండిపోయాయి. పశువులకు మేత తెచ్చే వాళ్లు లేక బక్క చిక్కి పాలు ఇవ్వడం తగ్గింది.

పశువుల పాకలు శుభ్రం చేసే వాళ్లు లేక , రొచ్చురొచ్చుగా తయారయ్యాయి. పాకల నిండా దోమలై అవి ఇండ్లలో చొరబడ్డాయి.

అయిదో రోజు రైతులూ, పెద్దొర దిగివచ్చారు. సంప్రదింపులకు పిలిచారు.

అందరూ వచ్చి సమావేశమయ్యారు. ఎవరో పెద్దొర కనపడ్డం లేదేమని అడిగారు.

పెద్దొర కొంచెం ఆగి వస్తానన్నాడని అంత వరకు మాట్లాడుకొని ఓ నిర్ణయానికి రమ్మన్నాడని అసాములు అన్నారు.

మర్రి కింద సంప్రదింపులు ఎంతసేపైనా ఒక కొలిక్కి రాలేదు.

అంతలో రయ్యి మంటూ జీపులూ, వ్యాన్లూ వచ్చాయి. జీపులోంచి సర్కిల్ ఇన్స్‌పెక్టరు, ఎస్సయి, పెద్దొర దిగారు. పెద్దొర మంత్రికి ఫోన్ చేసి పోలీసులను రప్పించాడు. వ్యానుల్లోంచి పోలీసులు దిగుతూనే లాఠీ చార్జీ చేసారు. అనుకోని సంఘటనకు బిత్తరపోయి ఏం చేయాలో తెలియక ఎటుపడితే అటు పారిపోయారు.

పాలేర్లు, కూలీలకు కొందరి కాల్లు, చేతులు విరిగాయి. తలలు పగిలాయి. రక్తం కారుతుంటే ఎవరూ తప్పించుకోలేకపోయారు.

ఒకరిద్దరు రైతులకు కూడా తలలు పగిలాయి.

ఆ రోజు నుంచి ఊళ్లో పోలీసులు క్యాంపు వేశారు. ఆ క్యాంపు పెద్దొర ఇంటి ముందే.

ఆ తర్వాత పెద్దొర పై కొందరు దాడి చేసినట్లుగా తలలు పగిలిన రైతులను పాలేర్లు గుమిగూడి చంపే ప్రయత్నంచేసినట్లు, చేన్లు, పెరన్లు రాత్రుల్లో వాళ్ళే పాడుచేసినట్టూ ఎన్నోకేసులు పెట్టారు.

క్యాంపు వేసిన నుండి పోలీసుల దౌర్జన్యం, భూస్వాముల దౌర్జన్యం పెరిగిపోయింది.

ఈ బాధలు భరించలేక కొందరు పాలేర్లు, కూలీలు ఊళ్లొంచే పారిపోయారు. పారిపోయిన వాళ్ళ కోళ్ళూ గొర్లూ పోలీసులు ఎత్తుక పోయారు.

పోలీసులు భూస్వాముల కంటే ఎక్కువ బాధలు పెట్టారు.

దొరికిన పాలేర్లతో పోలీసులూ, భూస్వాములు కలిసి బలవంతంగా పని చేయించారు.

ఏదో కేసులో కిష్టయ్య పెద్దన్నయ్యను జైల్లో వేశారు. కిష్టయ్య నాన్న తలపగిలితే ప్రభుత్వాసుపత్రికి పంపారు కిష్టయ్య చిన్నన్నయ్య పారిపోయాడు.

ఆ రాత్రి పోలీసులు వచ్చారు. యింట్లో కిష్టయ్య అమ్మ, చెల్లీ తప్ప ఎవరూలేరు.

పోలీసులు వచ్చినపుడు కిష్టయ్య నిద్ర పోతున్నాడు. నిద్రలో ఒక్కసారి అమ్మకేక వినబడి లేచాడు.

లేచిన కిష్టయ్య నోరు ఒక పోలీసు మూశాడు. కిష్టయ్య అమ్మ చీరంతా చిందర వందరయ్యింది. యిద్దరు పోలీసులు అమ్మ మీద దుప్పటి కప్పారు.

తెల్లవారి కిష్టయ్య అమ్మ చచ్చిపోయిందన్నారు. ఆ రాత్రినించి కిష్టయ్యని అమ్మ వద్దకు పోనీలేదు.

కిష్టయ్య అమ్మని ఊరవతలకి మోసుకపోయారు. అమ్మకి కిష్టయ్య చేతే నిప్పుపెట్టించారు.

కిష్టయ్య అమ్మ చచ్చిపోయింది.
కాని కిష్టయ్యని చూడనివ్వలేదు.

కిష్టయ్యకి అమ్మ యింకా బతికి ఉన్నట్లే అనిపిస్తోంది.

"అదిగో అమ్మ నా బాబే అని పిలుస్తోందంటూ వలవలా ఏడ్చాడు కిష్టయ్య."

అమ్మ చనిపోయాక రెండ్రోజులకే కిష్టయ్య చిట్టి చెల్లాయి అమ్మా! అమ్మా! అని బెంగగా ఏడ్చి ఏడ్చి కిష్టయ్య పక్కనే నిద్రోయింది.

పారిపోయిన కిష్టయ్య చిన్నన్నయ్య, మిగతా కూలీలు, పాలేర్లు ఇరుగు పొరుగు గ్రామాలలోని పాలేర్లతో కలిసి ఊరేగింపుగా ఆ వూళ్ళోకి వారం రోజుల్లోనే వచ్చారు.

పోలీసుల దౌర్జన్యం, భూస్వాముల దౌర్జన్యం నశించాలని నినాదాలు యిచ్చారు. రైతు కూలీ సంఘం వర్ధిల్లాలని జేజేలు పలికారు.

పాలేర్లు, కూలీలు ఆ ఊరేగింపుకు వచ్చేటపుడు ఎందుకైనా మంచిదని మనిషికో వెదురుకోల వెంట తెచ్చుకున్నారు.

ఊరేగింపు మీద పోలీసులు లాఠీచార్జీ చేశారు. పాలేర్లు, కూలీలు ఎదురు తిరగబడ్డారు.

ఊరేగింపు రణరంగంగా మారింది.

ఎస్సయి పిస్తోలుతో రెండుసార్లు ఆకాశంలోకి పేల్చాడు. ఫైర్, ఫైర్ అన్నాడు.

ఎస్సయి గుంపుమీద గురిపెట్టి కాల్చాడు. పోలీసులు తుపాకులు అందు కున్నారు.

ఆ కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. కిష్టయ్య చిన్నన్నయ్య ఆ కాల్పుల్లో గాయపడ్డాడు.

కిష్టయ్య ఇంటివద్ద యిపుడెవరూలేరు.

కిష్టయ్య నాన్న ఏ ఆసుపత్రిలో ఉన్నాడో తెలియదు. కిష్టయ్య నాన్న ఆరోగ్యం బాగయినాక పోలీసులు అటునుంచి అటే జైలుకు తీసుకపోతారని తెలిసింది.

కిష్టయ్య తను దిక్కులేని వాడయ్యాడు అని ఏడ్చాడు. పోలీసులే తనని దిక్కులేని వాడిగా చేశారని ఏడ్చాడు.

లక్ష్మి అమ్మ కూడ పనిలోంచి తీసేసింది. ఉదయం కలిస్తే "పదిహేను రోజులు పోతవా బోడిగుండు వెధవా" అని తిట్టి వెళ్ళగొట్టింది.

❄ ❄ ❄

నేనిప్పుడు దిక్కులేనివాన్ని అంటూ మళ్ళీ ఏడ్చాడు కిష్టయ్య.

లక్ష్మి ఏడ్చింది. ఏడుస్తూనే “ఏడవకు నీవు మా ఇంట్లోనే ఉందువుగాని, నేను నాన్నకు చెప్తా. నేను నీ చెల్లిని కానా అన్నయ్యా!’ అంది లక్ష్మి.

చీకటి పడింది. లక్ష్మి ఇంటికి చేరలేదు. లక్ష్మికోసం లత, శేఖర్, శ్రీధర్ బెంగపడిపోయారు. గీతా, సుజాతలు చెప్పింది విని శేఖర్ పార్కు వైపు వెళ్ళాడు. శేఖర్ ఏడ్చి ఏడ్చి కళ్ళు తుడుచుకుంటున్న వాళ్ళను చూసాడు.

శేఖర్ చేరే సరికి లక్ష్మి “నేను నాన్నకి చెప్తా నేను నీ చెల్లిని కాన అన్నయ్యా” అని అన్న మాటలు వినిపించాయి. ఎందుకో ఆవేదన కల్గింది శేఖర్‌కు.

శేఖర్ కిష్టయ్యని లత వెళ్ళగొట్టిందని ఉదయం ఇంట్లో విన్నాడు. శేఖర్ లక్ష్మిని ఒకవైపు కిష్టయ్యను ఒకవైపు చేర్చుకొని చేయిపట్టి ఇంటికి నడిపించుకు పోయాడు.

ఆ రాత్రి లక్ష్మి, కిష్టయ్యా ఏమీ తినలేదు. ఉదయం కిష్టయ్యని వెళ్ళ గొట్టినందుకు లత బాధపడింది. కిష్టయ్య యింటికాడి సంగతులు విన్నాక ఆకలిగా లేదంటూ శేఖర్ కూడా ఏమీ తినలేదు. లక్ష్మి మంచంలో ఒరిగింది. కూతురిని లత జో కొడుతూనే నిద్రోయింది. లక్ష్మిని ఇంకా అదే విషయం కలచి వేస్తోంది. నాన్న అందరూ “దేవుని బిడ్డలే” అంటాడు. “దేవునికి అందరూ సమానమే” అంటాడు.

అలా అయితే తన వయసే ఉన్న కిష్టయ్య తనలాగే ఎందుకు చదువుకో కూడదు? కిష్టయ్య చిన్నన్నయ్య తన అన్నయ్యలాగే ఎందుకు చదువుకోలేక పోయాడు? కూలీలుగా ఎందుకుండవలసివచ్చింది? దేవుడు వాళ్ళనెందుకు చదువుకోనీయలేదు?

అందరూ దేవుడి బిడ్డలైతే తానూ, అన్నయ్య, చదువుతూ ఉన్నారెలా? కిష్టయ్య చెల్లి, అమ్మ, చనిపోయారెలా? అందరూ దేవుని బిడ్డలైతే కిష్టయ్యకు యిన్ని కష్టాలెందుకు? దేవుడు అమ్మలా వుండాలి కానీ కష్టపెడుతాడా? తనలాంటి ఆ చిన్ని పాపలకు యిన్ని కష్టాలెందువల్ల? దేవుడు వాళ్ళని ఎందుకు కాపాడలేదు?

నిజంగా దేవుడుంటే దుర్మార్గులైన ఆ వూరి భూస్వాములనూ, పెద్దోళ్ళనూ, పోలీసులనూ ఎందుకు చంపలేదు? వాళ్ళకు మంచి బుద్ధి ఎందుకివ్వలేదు?

అందరూ దేవుని బిడ్డలే అయితే కొందరు యిలా ఎందుకు కష్టపడాలి? అసలు నిజంగా దేవుడున్నాడా? ఉంటే నాకో పిస్తోలు యిస్తే బాగుండు. కిష్టయ్య పెద్దన్ననూ, వాళ్ళ నాన్ననూ జైలునించి విడిపిస్తాను.

అలా ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయిందో లక్ష్మి. రాత్రి కలలో తాను ఎంతో పెద్ద ఇంజనీరై తుపాకులు తయారుచేస్తున్నట్టు కిష్టయ్య ఆ తుపాకులతో యుద్ధం చేస్తున్నట్టు కలగంది లక్ష్మి. కిష్టయ్యలోనూ అలాంటి కలే. నిద్రలో కలవరింతలు విని తల్లి లక్ష్మిని లేపింది. ఒక్కసారిగా ఉలిక్కిపడింది లక్ష్మి. లక్ష్మి వొళ్ళు జ్వరంతో కాలుతోంది. అక్కున చేర్చుకుంది తల్లి. లక్ష్మి ఏడుస్తూ అడిగింది - "నన్ను కొట్టవుగా" అంది లక్ష్మి.

"ఏంటమ్మా" అంది తల్లి.

"అమ్మా! దేవుడు నిజంగా ఉన్నాడా?"

తల్లి ఏమీ చెప్పలేక కూతుర్ని గుండెకు హత్తుకుంది.

నిద్రలో ఉలిక్కిపడి "అమ్మా" అంటూ నిద్రలేచాడు కిష్టయ్య. లత మొదటిసారిగా తల్లిలా కిష్టయ్యకేసి ఆత్మీయంగా చూసింది. అక్కున చేర్చుకుంది. కిష్టయ్యకు ఎంతో ధైర్యం.

"మా అమ్మ మంచిది" అంటూ జ్వరంతో లక్ష్మి అమ్మకేసి చూసి నవ్వింది.

**రచనాకాలం-1980**

**ప్రజాతంత్ర వారపత్రిక 10-16 అక్టోబర్ 2004**

**'తేనెటీగలు' కథల సంపుటి, 2004.**

ఉద్యమంలో బాల్యాన్ని కోల్పోయిన బాలల చిత్రణే ఈ దేవుని బిడ్డలు కథ. ప్రైమరీ స్కూల్ పిల్లల ఆలోచనలకు మించిన ఆలోచనలు ఇందులో పెద్దలకు ప్రశ్నల కొడవళ్ళు అవుతాయి. పిల్లలు నిద్రపోయినప్పుడు కలలో కథ ఉద్వేగభరితంగా ఎంతో ఉత్కంఠంగా కొనసాగుతుంది.

ఈ కథ ద్వారా పోరాటాలు పల్లెల నుండి పట్టణాలకు వ్యాపిస్తున్న సంస్కృతి కనపడుతోంది. ఎందుకు పల్లెలు అల్లకల్లోలంగా ఉన్నాయో, అనాథ అయిన పిల్లవాణ్ణి చూసేవారికి గుండెలు ద్రవిస్తాయి. తాము కూడా నైతికంగా ఆ పోరాటానికి మద్దతు పలకాలనిపిస్తుంది.

**- నందిగామ నిర్మలకుమారి**

(ఎం.ఫిల్ నుండి)